మసకబారుతున్న 'పల్లెప్రగతి'

- నాడు పల్లె ప్రగతితో అద్దంలా గ్రామాలు
- నేడు గ్రామాల్లో కనిపించని పారిశుధ్య నిర్వహణ
- వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం

గంగాధరలో గడ్డితో నిండిపోయిన డ్రైనేజీ

మధురానగర్‌లో జాతీయ రహదారి పక్కనే ప్రవహిస్తున్న మురుగునీరు

వెంకటాయపల్లిలో మురుగు నీటితో మునిగిపోయిన గేట్‌వాల్వు

గంగాధర, మే 29 : గ్రామాల్లో పల్లెప్రగతి మసకబారుతోంది, పల్లెల్లో ఎక్కడ చూసినా వీధుల్లో తొలగించని చెత్తకుప్పలు, పూడుకుపోయిన డ్రైనేజీలతో పారిశుధ్య నిర్వహణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. నాడు బీఆర్ఎస్ పాలనతో పల్లెప్రగతితో అద్దంలా మెరిసిన పల్లెలు నేడు చెత్తకుప్పలు, కంపు కొడుతున్న డ్రైనేజీలతో అనాథలుగా కనిపిస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సీజనల్ వ్యాధుల ప్రబలి ప్రజలు అనారోగ్యం పాలైయ్యే అవకాశం ఉన్నందున పాలకులు, అధికారులు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిని సారించాలని ప్రజలు కోరుతున్నారు.

బీఆర్ఎస్ పాలనలో పల్లెప్రగతితో అద్దంలా గ్రామాలు

నాడు బీఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం పల్లెప్రగతి కార్యక్రమాకి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా యేడాదికి రెండు సార్లు పల్లెప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వామ్యంతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా చేశారు. గ్రామాల్లో పరిశుధ్య నిర్వహణకు ట్రాక్టర్లను కొనుగోళు చేయడం, ఇంటింటి నుంచి తడిపొడి చెత్త సేకరణ, వీధులు, మురికి కాల్వలను శుభ్రం చేయడం, పిచ్చి మొక్కలు, ముల్ల పొదలను తొలగించడం, శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించడం, మురికినీరు నిల్వ ఉండకుండా చేసి బ్లీచింగ్ చల్లడం, గ్రామాల్లో సేకరించిన చెత్తను ఊరిబయట వేయడాని డంపిగ్ యార్డు నిర్మాణం, హరితహారంలో మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను నిర్వహించి వర్షాకాలనికి ముందే గ్రామాలను అద్దంలా మెరిసేలా చేసేవారు. దీంతో గ్రామాల్లో సీజన్ వ్యాధులు తగ్గుతూ వచ్చాయి.

నేడు గ్రామాల్లో కనిపించని పారిశుధ్య నిర్వహణ

నేడు గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, పూడుకుపోయిన మురికి కాల్వలతో పారిశుధ్య లోపంతో కండ్లకు కట్టినట్లుగా కనిపిస్తోంది. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రజల్లో సీజనల్ వ్యాధుల భయం పట్టుకుంది. చాలా గ్రామాలో డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడం వర్షాలు పడిన సమయంలో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. రోజుల తరబడి వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడంతో పందులు, కుక్కలకు ఆవాసాలుగా మారుతున్నాయి. మురుగు నీరు నిల్వ ఉండడం దోమలు అభివృద్ధికి కేంద్రాలుగా మారుతున్నాయి. గ్రామాలకు రక్షిత తాగునీరు అందించే గేట్ వాల్వులను శుభ్రం చేయకపోవడంతో, కలుషిత నీరు గేట్ వాల్వులోకి చేరుతోంది. దీంతో ఈ నీరు తాగిన ప్రజలు అనారోగ్యం పాలైయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో సక్రమంగా పారిశుధ్య నిర్వహన జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

బీసీ ఆజాదీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

ఏసీపీ మాధవికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హుజూరాబాద్ టౌన్, మే 29 : హుజూరాబాద్‌లో వరుసగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని బీసీ ఆజాదీ ఫెడరేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు చిలుకమారి శ్రీనివాస్ కోరారు. బీసీ ఆజాదీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పద్మశాలీ కుల సంఘాల నాయకులతో కలిసి హుజూరాబాద్ ఏసీపీ మాధవి, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిలుకమారి శ్రీనివాస్ మాట్లాడుతూ, హుజూరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడ్డారని, మృతుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. హుజూరాబాద్‌లో నిత్యం ఎక్కడో ఓ చోట ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. హుజూరాబాద్‌లోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేయాలని, స్పీడ్ బ్రేకర్లను అమర్చాలని, అలాగే యాక్సిడెంట్ జోన్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ సంఘం సత్యనారాయణ, బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఇప్పకాయల సాగర్, జిల్లా ఉపాధ్యక్షుడు తాడూరి మల్లేశ్ గౌడ్, నాయకులు కూరపాటి రామచంద్రం, పంజాల వెంకటేశ్వర్లు, నిమ్మల ఇస్మాయిల్, నాయీబ్రాహ్మణ సంఘం డైరెక్టర్ రమేశ్ పాల్గొన్నారు.

పోలీస్ కళాబృందాన్ని పునఃప్రారంభించాలి

కలెక్టరేట్, మే 29 : రెండేళ్లుగా జిల్లాలో రద్దయిన పోలీస్ కళాబృందాన్ని తిరిగి ప్రారంభించాలని, ప్రముఖ గాయకుడు, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోనెల సమ్మన్న కోరారు. రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి జిల్లాలో అప్పటి పరిస్థితుల నేపథ్యంలో ప్రజలను చైతన్యపరిచే క్రమంలో అప్పటి పోలీస్ సూపరింటెండెంట్ సురేంద్రబాబు ఆధ్వర్యంలో కళాబృందం ఏర్పాటైందని, పల్లెల్లో పోలీసు కళాకారుల చేత సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి, తమ సాంస్కృతిక ప్రదర్శనలతో అసాంఘిక శక్తులపై అవగాహన కల్పించడంలో కళాబృందం చేసిన కృషి అమోఘమన్నారు. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన అనంతరం కూడా వాటిని కొనసాగించిన గత ప్రభుత్వం గ్రామాల్లో మూఢనమ్మకాలు, మద్యం, గుడుంబా, వరకట్న నిషేధం, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, భూతగాదాలు, గుట్కా, మట్కా, మత్తు పానీయాలు, కళాశాలల్లో ర్యాగింగ్, అత్యాచారాలు, హత్యలు, ఇతర అంశాలపై కూడా కైగట్టి ఆలపించే పాటలతో గ్రామాలను ఉర్రూతలూగించిందని గుర్తుజేశారు. గత పోలీస్ కమిషనర్ కమల్‌హాసన్‌రెడ్డి హాయాంలో కూడా మానేరు ఆనకట్టపై వచ్చే సందర్శకుల కోసం ప్రతి ఆదివారం సాయంత్రం కళాబృందం ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తూ, ఆహ్లాద భరిత వాతావరణాన్ని కల్పించడంలో కళాబృందం ఇతోధికంగా కృషి చేసిందన్నారు. అనేక సామాజిక రుగ్మతలపై నిత్యం ప్రజల్లో చైతన్యం తెస్తున్న కళాబృందం సేవలు రెండేళ్ల నుంచి అందకపోవడం జిల్లావాసుల్లో తీరని వెలితి నింపుతోందన్నారు. కళాబృంద చైతన్య సదస్సులు లేక గ్రామీణ ప్రాంతాల్లో యువత పెడదోవ పడుతోందని, అసాంఘిక కార్యక్రమాలపై యువత దృష్టి సారిస్తుండడంతో వారి జీవితం అగమ్యగోచరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పోలీస్ కళాబృందాన్ని పునరుద్ధరించి, చైతన్య సదస్సులు నిర్వహించాలంటూ గురువారం విడుదల చేసిన ప్రకటనలో సీపీ గౌస్ ఆలంను ఆయన కోరారు.

ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు

చొప్పదండి, మే 29 : మండలంలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. అంతర పంటల ఆదాయం ఆయిల్ పామ్ తోటల్లో నాలుగేళ్ల తర్వాత దిగుబడి ప్రారంభం అవుతుందని రైతు మంచి ఆదాయం పొందవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ఆయిల్ పామ్ తోటలో అంతర పంటగా పాక్షిక నీడ అవసరమయ్యే, కోకో, వక్క, పంటల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ పెట్టిన రైతులకి లోహియా ఎడిబుల్ ఆయిల్స్, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రమ్య శ్రీ, లోహియా డిప్యూటీ మేనెజర్ హరిశ్, ఫీల్డ్ ఆఫీసర్ వంశీ, రైతులు గుర్రం భూమారెడ్డి, గుర్రం మల్లారెడ్డి, సోమ మల్లారెడ్డి, గుర్రం చంద్రారెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, గుర్రం శ్రీనివాస రెడ్డి, మరిమడ్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎరడపల్లిలో పౌరహక్కుల దినోత్సవం

శంకరపట్నం, మే 28 : మండలంలోని ఎరడపల్లిలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేఖ తెలిపారు. ఉదయం 11 గంటలకు గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. మండల, గ్రామస్థాయి అధికారులు, దళిత సంఘాల నాయకులు పాల్గొనాలన్నారు.

అగ్నివీర్ జవాన్‌కు ఘన సన్మానం

చిగురుమామిడి, మే 29 : మండలంలోని రేకొండకు చెందిన పిక్కాల అనిల్ పంజాబ్ బెటాలియన్‌లో అగ్నివీర్ జవాన్‌గా చేరి ఇండియా పాక్ సరిహద్దుల్లో సైనిక సేవలు అందించారు. రెండు రోజుల క్రితం సొంత ఊరు రేకొండకు రావడంతో గ్రామస్తులు జవాన్ అనిల్‌ను గురువారం గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. దేశం కోసం సరిహద్దుల్లో చేస్తున్న సేవలను గ్రామస్తులు కొనియాడారు. సన్మానించిన వారిలో దొడ్ల రమణారెడ్డి, కొత్తూరు రమేశ్, పీరల్ల భీరయ్య, కానవేణి శ్రీనివాస్, దొడ్ల వెంకటరెడ్డి, బండారి మల్లేశ్, విలాసాగరం సహదేవ్, అరిగెల శ్రీధర్, కొమురయ్య, తిరుపతి తదితరులున్నారు.

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా 'పెండెం'

జమ్మికుంట, మే 29 : తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమావేశం హైదరాబాద్ ముగ్దం మోహినుద్దీన్ భవన్‌లో ఇటీవల జరుగగా, ఆ సంఘం సభ్యులు రాష్ట్ర అధ్యక్షుడిగా మున్సిపల్ పరిధిలోని ధర్మారంకు చెందిన పెండెం సర్వేశంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సర్వేశం మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్లన్నీ నెరవేర్చాలన్నారు. ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లుతానన్నారు. కాగా, సర్వేశం ఎన్నికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నుస్తులాపూర్ వైన్స్‌లో గొడవ..

తిమ్మాపూర్,మే29: మండలంలోని నుస్తులాపూర్ వైన్స్‌లో వైన్స్ వర్కర్లు, మద్యం ప్రియుల మధ్య గొడవ జరిగింది. వైన్స్‌లో మద్యం తాగేందుకు వచ్చిన కొంతమంది వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసి, వైన్స్ అనుబంధంగా ఉన్న పర్మిట్ రూంలో తాగేందుకు వెళ్లారు. అయితే వారి పట్ల సిబ్బంది దురుసుగా ప్రవర్తించడంతో మాటా, మాటా పెరిగి ఇరువర్గాలు మద్యం బాటిళ్లతో కొట్టుకున్నారు. దీంతో మద్యం తాగేందుకు వచ్చిన పలువురికి గాయాలయ్యాయి. దాడిలో మన్నెంపల్లికి చెందిన యువకుడికి గాయాలైనట్లు సమాచారం.. విషయం తెలుసుకున్న ఎల్ఎండీ పోలీసులు వెళ్లి విచారణ చేపట్టారు. ఇరు వర్గాల్లో ఒక వర్గం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. కాగా, వైన్స్ నిర్వాహకులు ఎలాంటి నిబంధనలు పాటించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మద్యం కొనుగోలు చేసేందుకు వచ్చేవారు వైన్స్ ముందు రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో అటుగా వెళ్లే గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు..

రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ.1.90 కోట్ల క్లెమ్

విద్యానగర్, మే 29: సాయి కుమార్ గౌడ్ రోడ్డు ప్రమాదంలో ఆకస్మిక మృతితో వారి కుటుంబం తీవ్ర విషాదంలో పడింది. అయితే ముందుగా తీసుకున్న టాటా ఏఐఏ టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ ద్వారా కుటుంబానికి ఆర్థికంగా భారీ భద్రత లభించింది. సాయి కుమార్ గౌడ్ గత జనవరి 17, 2025న టాటా ఏఐఏ అడ్వైజర్ అయినటువంటి గజ్వేల్‌కు చెందిన షేర్పల్లి ఆంజనేయులు ద్వారా వార్షిక ప్రీమియంగా 1,25,127 చెల్లించి టర్మ్ పాలసీ తీసుకున్నారు. మార్చి 9, 2025న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఆయన నామినీగా ఉన్న అంకం ప్రసన్న ఏప్రిల్ 8న క్లెయిమ్ ప్రక్రియ ప్రారంభించారు. అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించిన అనంతరం మే 19, 2025న క్లెయిమ్ మొత్తం 1,90,00,000 వారి ఖాతాలోకి జమ చేశారు. పాలసీ తీసుకున్న మూడు నెలల్లోనే అనుకోని ప్రమాదంలో మరణించినప్పటికీ కోటి 90 లక్షల ఇన్సూరెన్స్ డబ్బులను నామిని బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఈ సందర్భంగా టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ జోనల్ హెడ్ భరణి యారడ, కరీంనగర్ బ్రాంచ్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ, ఒక సాధారణ ప్రీమియంతో అకాల మరణంలో కుటుంబానికి కోట్లలో భద్రత అందేలా టర్మ్ ఇన్సూరెన్స్ పనిచేస్తుంది. ప్రతి కుటుంబనేత జీవిత భద్రతకు ఈ కాలంలో టర్మ్ బీమా తప్పనిసరి అన్నారు. పాలసీ తీసుకున్న 45 రోజుల్లో ఆక్సిడెంట్ ద్వారా మరణించిన వ్యక్తి కుటుంబానికి కోటి రూపాయల బీమాతో పాటు 90 లక్షల ప్రమాద బీమా ఇవ్వడం జరిగిందన్నారు. బ్రాంచ్ ఎంప్లాయీస్, ఆదర్శ్ కుమార్, లీడర్స్, రాయపోలు ప్రసాద్, దూలం రమేశ్, గూడెల్లి రాజు, నరేందర్ రావు, అడ్వైజర్లు, షేర్ పల్లి ఆంజనేయులు, విద్య సాగర్, స్వామి పాల్గొన్నారు.

మంత్రి వర్గ విస్తరణలో మాదిగలకు చోటివ్వాలి

తెలంగాణచౌక్, మే 29 : రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగ సామాజిక వర్గానికి అవకాశం ఇవ్వాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సముద్రాల అజయ్‌కుమార్, సుద్దాల లక్ష్మణ్ డిమాండ్ చేశారు. నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, తెలుగుదేశం పాలన నుంచి నేటి ప్రభుత్వ పాలన వరకు అన్ని రాజకీయం పార్టీలు మాదిగలకు మంత్రి పదవులు ఇవ్వలేదన్నారు. జనాభా దామాషా ప్రకారం.. క్యాబినెట్‌లో ఇద్దరు మాదిగలకు మంత్రి వర్గాంలో చోటు ఉండాలన్నారు. ఎస్సీ వర్గీకణ పై సుప్రీమ్ కోర్టు ఇచ్చిన తీర్పును దేశంలో మొదట రాష్ట్రంలో అమలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. సౌమ్యుడు. విద్యవంతుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు మంత్రి వర్గ విస్తరణలో చోటు కల్పించాలని సీఎంను కోరారు. డీసీసీ అధ్యక్షుడిగా పార్టీ అభివృద్ధికి కృషి చేసిన కవ్వంపల్లి సత్యనారాయణకు మంత్రిగా అవకాశం కల్పించి మాదిగలకు సముచిత గౌరవం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి గోస్కుల శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు కల్వల ఆనంద్,జేఏసీ మహిళా విభాగం అధ్యక్షురాలు అవారులత, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండ్ర సంపత్, జిల్లా కార్యదర్శి అంజయ్యలు పాల్గొన్నారు.

అధిక ధరలకు వస్తువులను విక్రయించొద్దు

బస్టాండ్ ఏటీఎం సురేశ్

తెలంగాణచౌక్, మే 29 : బస్టాండ్ ఆవరణలోని దుకాణాల్లో అధిక ధరలకు వస్తువులను, తినుబండారాలను విక్రయించొద్దని జిల్లా కేంద్రంలోని బస్టాండ్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (ఏటీఎం) సురేశ్ పేర్కొన్నారు. గురువారం బస్టాండ్‌లోని దుకాణదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వస్తువుల మీద ఉన్న ధరలకే వస్తువులను విక్రయించాలని, నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు విక్రయిస్తే జరిమానా, నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. ప్రయాణికులతో మర్యాద ప్రవర్తించాలని సూచించారు. నిత్యం వేలాది మంది ప్రయాణికుల ప్రయాణించే బస్టాండ్‌ను శుభ్రంగా ఉండేలా సహకరించాలన్నారు. బస్టాండ్ అవరణలో దుకాణదారుల పాల్గొన్నారు.

వ్యవసాయానికి ఉపాధి పనులను అనుసంధానం చేయాలి

మాట్లాడుతున్న కోదండ రెడ్డి

సైదాపూర్, మే 29: వ్యవసాయానికి ఉపాధి హామీ పనిని అనుసంధానం చేస్తే రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. మండకేంద్రంలోని సింగల్ విండో కార్యాలయం వద్ద రాష్ట్ర స్థాయి వికసిత్ కృషి సంకల్ప యోజన ప్రారంభ కార్యక్రమాన్ని జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించగా చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంకల్ప యోజన కార్యక్రమం ద్వారా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తారన్నారు. డీడీఈ అగర్వాల్, ఐసీఏ అర్ ఆటారీ జోన్ ఎక్స్‌షేక్ మీరా, ఎస్‌కేఎల్‌టీజీహెచ్‌యూ వైస్ ఛాన్సలర్ రాజిరెడ్డి, టీసీసీవోసీ ఏ డైరెక్టర్ డాక్టర్ కేశవులు, రైతు వ్యవసాయ కమిషన్ సభ్యులు నర్సింహారెడ్డి, కోరమాండల్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి తదితరుల ఉన్నారు.

చర్యలు తీసుకోవాలి

సైదాపూర్, మే 28 : ట్రైయినీ ఎస్ఐ భార్గవ్‌పై చర్యలు తీసుకోవాలని గొల్లగూడెం గ్రామానికి చెందిన బత్తుల మహేందర్ కోరారు. గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ, తాను మండలకేంద్రంలో కూల్ డ్రింక్ ఏజెన్సీ నిర్వహిస్తానని ఈ నెల 8న పలు గ్రామాల్లో పని ముగించుకొని తిరిగి ఇంటికి వస్తుండగా లస్మన్నపల్లి వద్ద ట్రైయినీ ఎస్ఐ, పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేస్తున్నారని తెలిపారు. పోలీసులు బండి ఆపమనగానే బండి ఆపానని, నాకు ఫోన్ రాగా మాట్లాడుతుండగా, పోలీసులు తనను కొట్టారన్నారు. ఈ దాడీలో చెవి కర్ణ బేరి పగిలి తీవ్ర గాయాలయ్యాయన్నారు. ఈ విషయంపై ఏసీపీ, సీపీ, జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుపారు. ఎస్ఐ, పోలీసులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

రాంరెడ్డికి ఘన నివాళి

రాంరెడ్డి

కార్పొరేషన్, మే 29 : ఎందరికో విద్యాదానం చేసి తన తుది శ్వాస వరకు బోధననే వృత్తిగా భావించి రసాయన శాస్త్రంలో ఎంతో ప్రఖ్యాతి పొందిన సీనియర్ ఆధ్యాపకుడు గుర్రాల రాంరెడ్డి అనారోగ్యంతో బుధవారం మృతి చెందగా, గురువారం అంత్యక్రియలకు వారి శిష్య బృందం హాజరై ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ విద్యాబోధనలో కెమిస్ట్రీని ఇంటిపేరుగా మలుచుకొని కెమిస్ట్రీ రాంరెడ్డిగా కరీంనగర్‌లో పేరు గడించారని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఎంతో మంది విద్యార్థులను తన బోధనతో ఉన్నతంగా తీర్చిదిద్దినారన్నారు. వారి ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీ అశోక్ యాదవ్, చెన్నాడి రాజేశ్వర్ రెడ్డి, పుల్లూరి రామ్మోహన్‌రావు, వంగపల్లి రాజేశ్వర్, ఏ కిరణ్‌కుమార్, ఏడబోయిన శ్రీనివాస్‌రెడ్డి, కొట్టె తిరుపతి, వంశీక్రిష్ణ, హరీశ్ నివాళులర్పించారు.

స్వర్ణామృత ప్రాసన గుళికల వితరణ

హుజూరాబాద్ టౌన్, మే 29: త్రిదండి చిన్నజీయర్ రామానుజ స్వామి వారి దివ్య ఆశీస్సులతో వికాస తరంగిణి హుజూరాబాద్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆరు నెలల నుంచి 16 ఏండ్ల పిల్లలకు ఈ నెల 31న స్వర్ణామృత ప్రాసన గుళికలను వితరణ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం పట్టణంలోని రామాలయంలో కరపత్ర ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వర్ణామృత ప్రాసన ఆయుర్వేదిక గుళికలతో పిల్లల మానసిక సామర్థ్యం, జీర్ణ శక్తి మెరుగుపడుతుందన్నారు. రోగనిరోధక శక్తిని, జ్ఞాపకశక్తిని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరా చార్యులు, వికాస తరంగిణి హుజురాబాద్ శాఖ సభ్యులు యతిపతి అరుణ్ కుమార్, డా. దివిటీ అంజనీ దేవి, చిదురాల శ్రీనివాస్, చెరుకుపల్లి శ్రీవాణి, యతిపతి నిరంజన్ కుమార్, అక్కినపల్లి శ్రవణ్, దాసి కుమారస్వామి, చల్లూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మే 29: నగరంలో 11కేవీ ఫీడర్ మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పద్మనగర్, పారామిత(పద్మనగర్) స్కూల్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-2 ఏడీఈ లావణ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జిల్లాలో మిషన్‌శక్తి బృందం పర్యటన

కలెక్టరేట్, మే 29 : కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి కేంద్ర బృందం గురువారం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా, జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పరిధిలోని పలు విభాగాల కార్యాలయాలను సందర్శించారు. మిషన్ శక్తి పథకంలో భాగంగా జిల్లాలో ఏర్పాటు చేసిన మహిళా సాధికారత కేంద్రం, సఖీ వన్ స్టాప్ సెంటర్, శక్తి సదన్, సఖీ నివాస్ విభాగాలను బృందం సభ్యులు, ఎన్ఐసీ సంయుక్త సంచాలకుడు ఇహ జైన్, యంగ్ ప్రొఫెషనల్ రాహుల్ రానా, అంతరిక్ష భరద్వాజ్, మిషన్ శక్తి రాష్ట్ర విభాగం ఇన్‌చార్జి బ్లేస్సి సందర్శించారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో కేంద్ర బృందం సభ్యులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, మహిళా సాధికారిక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ శ్రీలత, సఖీ అడ్మిన్ లక్ష్మి, శక్తి సదన్ సూపరింటెండెంట్ రమాదేవి, డీసీపీవో పర్వీన్, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సంపత్, పద్మపాని ఎన్జీవో నిర్వాహకుడు సత్యనారాయణ రెడ్డి, ప్రకృతి ఎన్జీవో నిర్వాహకులు డజయశ్రీ పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో డీఈవోను సన్మానించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

కార్పొరేషన్, మే 29 : కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన శ్రీరాం మొండయ్యను గురువారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, తపస్ ప్రతినిధులు సన్మానించారు. కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ టెక్నోలో నిర్వహించబడుతున్న ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు ఆధ్వర్యంలో సందర్శించిన సందర్భంలో ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, తనకు ప్రథమ ప్రాధాన్య ఓటు వేసి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించినందుకు ఉపాధ్యాయ లోకానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను తీర్చడానికి తన శాయాశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చినారు. ఇప్పటికే ప్రభుత్వానికి ఉపాధ్యాయుల సమస్యలపై 20 పేజీలతో కూడిన ఒక మెమోరాండం సమర్పించినట్లుగా తెలిపారు. ఉపాధ్యాయులు అందరూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను గుణాత్మక విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే ప్రముఖ పాత్ర వహిస్తారని, ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు అశోక్‌రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, భగవంతయ్య, అంజిరెడ్డి, తిరుపతిరావు, వెంకటేశ్వర్లు, రాజేశ్వర్, పవన్‌కుమార్, శ్రీధర్, తిరుపతి, సత్యం, రవీందర్‌రెడ్డి, ఎం.సతీష్‌కుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమి కౌలుకు వేలం

శంక